శత్రువు

శంకరం అవాక్కయిపోయాడు.

మొహం మీద గంటుపెట్టుకుని, వీధికుక్క మొరుగుతున్నట్టు అరుస్తున్నాడు..యం.డీ. "చేయించడం చేతకాని ప్రతీ వాడు ఆఫీసరే. నిచ్చెనెక్కేస్తూ పైకి పైకి వచ్చేయ్యడానికి మాత్రం ఎక్కడ లేని ఆబా, ఆరాటం"

శంకరం యం.డీ మొహంకేసి దొంగ చూపులు చూశాడు. ముక్కు పక్కనించీ బయల్దేరి, కంటి కొస దాకా సాగిన మడతలో రక్తం ఉబుకుతోంది..

దమడమాల బండి సాగిపోతోంది.

"ఇంకోడి చేత చేయించలేకపోతే, చెయ్యడం నేర్చుకోవాలి గాడిదల్లా"

"ఓరీ ముండాకొడకా.... ఎంతమాటన్నావురా...?" శంకరం మనస్సుకు ముల్లు గుచ్చుకుంది, 'అబ్బ' అని మూలిగింది.

యం.డీ. ఊరంత గొంతూ ఇప్పుడు స్టేటంత గొంతయింది. "వేలకి వేల జీతాలిచ్చి ఎందుకు మనల్ని పోషిస్తున్నది?"

"ఇట్టా శివాలు, చిందులు వేయడానికిట్రా వెధవ?"... శంకరం స్వగతం కసి తీర్చుకుంటోంది.

'మీ పద్ధతి నచ్చలేదు నాకు' ముక్తాయింపు దెబ్బకొట్టి, మూతి బిగించుకుని, చేతిలోని గ్లాస్ పేపర్ వెయిట్‌ని తిప్పుకుంటూ కూర్చున్నాడు, యం.డీ.

శంకరం నసగాలనుకున్నాడు, "నే చెప్పేదీ..." అని.

యం.డీ. గారి అసహనం గ్రాఫ్ ఇప్పుడు తారాస్థాయికి పోయింది. అది అతన్నో కోతిని చేసి పారేసింది. లేచి నుంచున్నాడు. "మీరేం చెప్పినా నేను విననుగాక వినను, వినను వినను. అసలు మీరేమీ చెప్పక్కర్లేదు. చెప్పాల్సిందంతా ఆ యూనియన్ లీడరే చెప్పాడు... పొద్దున్న... " ఆగాడు, "యూకెన్ గో..." వత్తి వత్తి పలికాడు.

శంకరం ఛాంబర్ బయటపడ్డాడు, తన్నేసిన ఫుట్‌బాల్‌లా. అందునా, ముళ్ళకంపలో పడినట్లయింది మనస్సు.

వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. అకారణంగా ఎంతమాటన్నాడు... దర్టీఫెలో. ఎగోటిక్. అతి పెద్ద సమస్యని అవలీలగా పరిష్కరించి లోపలికి పోతే, అసంబద్ధంగా, అఖ్ఖర్లేని విషయం లాగీ, పీకీ, పేట్రేగిపోయాడు. బూట్‌కింద చిటికెనవేలుని తొక్కిపట్టినట్లుంది. గుటక దిగలేదు. కళ్ళల్లో నీళ్ళు పేర్కొన్నై. కసీ, కోపం, రోషం ఉక్రోషం... ఆవకాయ దినుసుల్లా కలిసిపోయి మంట పుడుతున్నై.

జుట్టులోకి వేళ్లని జొనిపి పిచ్చివాడిలా తల విదిలించుకున్నాడు. అంతలోనే రెండు చేతుల్తో తల పట్టుక్కూర్చున్నాడు. పిడికిలి బిగించాడు. పెదవి కొరుక్కున్నాడు. క్రోధం కళ్లల్లోకి ఎగదన్నుకొచ్చింది.

***

పిచ్చెయ్యకి ఆ రోజు చాలా దుర్దినం.

బాస్ అనబడే శంకరం, సూపర్‌వైజర్ పిచ్చెయ్యని కేబిన్‌లోకి పిల్చాడు. రెండు కాళ్ళూ సర్దుకుని సరిగా నిలబడేలోగానే... ధూమ్ ధామ్‌లు మొదలయినై.

"ఈ ఎరియర్స్‌కేమీ అడ్డూ ఆపూలేకుండా ఇట్లా ఇన్‌క్రీజ్ అయిపోతూవుంటే, ఏం చేస్తున్నారండీ మీరంతా. మందలు మందలుగా క్యాంటీన్‌లో కబుర్లూ, టేబుల్స్ దగ్గర మీటింగులూ...."

విశాఖపట్నం మీద బాంబులు వెదజల్లుతున్న జపాన్ వాడిలా అనిపించాడు శంకరం. పిచ్చెయ్య మరి హిస్టరీ పి.జి! తలెత్తి శంకరంని చూశాడు. దట్టంగా, పొడుగ్గా, నల్లగా వున్న కనుబొమ్మలు, కుమ్మరి పురుగుల్లా కదులుతున్నై. మొహం మిట్టమధ్యాహ్నపుటెండలా మిటమిటదలాడిపోతోంది.

"నిజానికి.... మొత్తంమీద... ఎరియర్స్... ఈ వారం తగ్గాయం...! పిచ్చెయ్య "డీ"ని ఢీకొంటూ శంకరం చేతిలోని ఎర్ర మార్కర్ అతనిముందు పాడ్‌లో వున్న స్టేట్‌మెంట్‌లో ఓ అంకెకి గుండుసున్నా చుట్టింది. "నా చెవిలో పూలూ, వనాలూ

కథా నిలయం
55504
శ్రీకాకుళం

పెట్టండి. ఇదిగో... ఈ ఐటమ్. దీని సంగతేమిటి?"

పిచ్చెయ్యకి తాటి ప్రమాణంగా లేచింది, కోపం. (పైకేమీ అనకుండా) తమాయించుకున్నాడు.

'ఓరి సన్నాసీ.... గాడిదకొడకా. ఏం హిపోక్రసీరా నీది. అది యూనియన్ లీడర్ సీటురా వెధవా. నీకు తెలిసిన సంగతే కదరా... చచ్చుపీనుగా. నీకు వాణ్ణడిగే దమ్మేదిరా...' ఇలా, ఇలా సీరియల్‌గా తిట్టుకోసాగింది... పిచ్చెయ్య మనస్సు.

"ఆ... ఊ..." అంటూ సగం తెరిచిఉన్న కిటికీలోంచి బయటకు చూసి "ఛీ...ఛీ... హారిబుల్" అని పిచ్చెయ్యకేసి చూశాడు, శంకరం. చూపులు కలుసుకున్నై.

"అదేమంత హారిబుల్ కాదండీ... ఇవన్నీ మామూలుగా ఉండే ఎరియర్సేనండీ" అంటూ నసిగాడు, పిచ్చెయ్య.

ఇంట్లో కూర్చుని వీధిలోకి రాళ్ళు రువ్వుతున్నట్టు అనిపించింది శంకరంకి. పిచ్చెయ్యకి చిరాకు హెచ్చింది. " మీ సమర్థింపు కాదు నాక్కావలిసింది. పని. అవును. వర్క్... వర్క్... అంతే. ఈ నెలాఖరుకు ఎరియర్స్ తగ్గకపోతే యాక్షన్ తీసుకోవల్సి ఉంటుంది. వెళ్లండి".

'తిక్కముండాకొడకా.... కొంపలు మునిగే వ్యవహారాల్లోనే నీరో తత్వం కదరా నీది. ఏం వొచ్చిందివ్వాళ. కాకిలా కావ్ కావ్ మంటున్నావ్....' అనుకుంటూ వచ్చాడు పిచ్చెయ్య. వచ్చి సీట్లో కూర్చున్నాడు.

' చెవులో పూలూ వనాలూ. పెట్టకండి'....

'యాక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది'.....

తలపుకు తలపుకొస్తోంది... శంకరం మాట!

దారిన పోతూంటే దాడి చేసి అదాటున గొడ్డుకారం మొహానికి మెత్తినట్లనిపిస్తోంది పిచ్చెయ్యకి. హాల్లో గుమాస్తాలంతా తనకేసి చూసి సన్న సన్నగా నవ్వుకుంటున్నారనిపించింది. అందులో ఆ కొత్త టైపిస్ట్ హసీనా, మరీ కంతిరిగా నవ్వుతోంది. తెలివిగా నవ్వుతోంది., 'ఓరి వెర్రి వెధవాయ్ బాస్ దగ్గర బాంగింగ్

చేయించుకొచ్చి పెద్ద ఫోజు కొడతావేంటిరా ...' అన్నట్టు వికృతంగా నవ్వుతోంది. సున్నారాసి సగం చెరిపేసినట్టు పెదవుల్ని మార్చి, మార్చి నవ్వుతోంది.

పిచ్చెయ్యకి గుండె మండిపోయింది. వంటసోడామీద నిమ్మకాయ పిండినట్లు – పిచ్చెయ్య కోపంమీద అవమానం బుసబుస పొంగింది. మెదడంతా మందు దట్టించిన క్వారీలా అయిపోయింది.

ఠక్కున లేచాడు.

***

పిచ్చెయ్య రావడమే తుఫాన్‌లా వచ్చాడు. చెప్పులు రెండూ హాల్లో రెండు మూలలకీ పరిగెత్తి దాక్కున్నై. చేతిలో బ్యాగ్‌ని టేబుల్ మీదకి గిరాటేసి కుర్చీలో కూలబడ్డాడు. మంచినీళ్ల గ్లాస్ అందించి భర్తకేసి చూసింది తులశమ్మ.

తులశమ్మకి ముప్పై ఏళ్ల పరిచయం– ఆ మొహమూ, ఆ మనిషీ! ఆ మొహం నవరసాలు పండించిన సందర్భాలు చాలా చూసింది. కానీ, ఇవ్వాళ – 'అరుణ గభస్తిమండలం' లా వుంది అది! (అవును. తులశమ్మ ఆకాలంలో సీనియర్ తెలుగు పండిట్‌గారి నాలుగో పుత్రికారత్నం లెండి!!!)

పిచ్చెయ్య కాఫీ తాగలేదు. ఆ గ్లాస్‌ని టేబుల్‌మీద ఉంచి, పెద్ద గొంతుతో అరిచాడు, "ఇది ఇల్లా, కల్లుపాకా. ఇరవైనాలుగ్గంటలూ ఆ టీవీని అట్టా చావగొట్టకపోతే తోచదా. కొంపెగిరిపోయేట్టు ఎందుకంత సౌండు. ఛీ...ఛీ... వెధవ కొంప, వెధవ మనుషులూ..."

భర్త చిరాకుకీ, విసుగుకీ తులశమ్మ విస్తుపోయింది.

ఈలోగా పిచ్చెయ్య చెల్లెలు టీవీ వాల్యూమ్‌ని తగ్గించింది. మాట్లాడకుండా లోపలికి నడిచింది తులశమ్మ.

కాఫీ ముగించి గదిలోకొచ్చాడు పిచ్చెయ్య. ఆయన నాలుగో పుత్రరత్నం–రాజు–వెంటనే మళ్లీ టీవీ. వాల్యూమ్‌ని పెంచాడు. ఆ పదేళ్ల విద్యార్థికీ– జీ టీవీ, స్టార్లూ– ఏదీ మిస్‌కాకూడదు.

పిచ్చెయ్యకి తిక్కతిక్కగా వుంది. పిచ్చిపిచ్చిగా వుంది. మనసంతా అలుగ్గుడ్డలా మసిమసిగా వుంది. "నా లుంగీ, టవల్ ఎక్కడ చచ్చినయ్" పొలికేక వేశాడు. వంటింట్లోనుంచీ పరిగెత్తుకొచ్చింది తులశమ్మ. "ఎందుకండీ అంత చిరాకూ, కోపం. ఏం జరిగిందనీ. అవిగో. రోజూ ఉండే చోటే వున్నె. చూసుకోకుండా అరుస్తారేం?"

"అవునే. నేనే అరుస్తున్నాను. నాకే చిరాకూ కోపం. ఏ విసుగూ, చిరాకూ, కోపం లేకుండా ఎప్పుడూ... ముద్దుముద్దుగా..చూసుకోవాలి నిన్నూ, ఈ ఇంట్లో అందర్నీను. అంతేగా నువ్వనేది?"

"ఇది మరీ బాగుంది. మేమేం చేశామనిరా నీ ధూము ధాములు" పిచ్చెయ్య తల్లి మాట కలిపింది.

"తల్లీ...నీకో నమస్కారం. మీ తల్లీకూతురూ గోదాలోకి దిగకండి. నే ఛావలేను"

"నేనేమన్నాననీ..ఇప్పుడు. ఏదో ఆ పిల్లకీ నాకూ కాలక్షేపమని టీవీ పెడతాం అంతేగా... ముట్టుకోవద్దంటే చెప్పండి. అదీ మానేస్తాం." తల్లి సన్నాయి నొక్కులు.

"అవును, అదీ చెప్పండి. టేప్ రికార్డర్ ముట్టుకోకూడదు, రేడియో ముట్టుకోకూడదు. వంటింట్లో మిక్సీ ముట్టుకోకూడదు. హాల్లో ఫ్రిజ్ ముట్టుకోకూడదు." చెల్లెలు సాగదీస్తోంది.

"ఎందుకమ్మా సరోజా అక్కర్లేని విషయాలు అవన్నీ ముట్టుకోవద్దని ఎవరన్నారు?"

"ఎవరనాలమ్మా... మీరే... నువ్వూ, నీ కొడుకూ, కూతురూ.... అంతా మీ పెత్తనమేగా" తల్లి.

"ఆ అంతా మా పెత్తనం కనకే ఇంత గొప్పగా సుఖపడిపోతున్నాం" తులశమ్మ సమాధానమూ విసురుగానే వచ్చింది.

"చూశావా... చూశావా"అంటూ రాద్ధాంతంలోకి దిగింది తల్లి.

పిచ్చెయ్యకి సహనం నశించింది. 'మీరిట్టాగే కొట్టుకు ఛస్తూవుండండి.

నేనెప్పుడో ఈ బీ.పీ.తో హరీమంటాను. ఆ తర్వాత అంతా కలిసి హాయిగా వుండండి".

"అనండి అనండీ. చివరికి ఉరుము వురిమి నా నెత్తినేగా పడేది" తులశమ్మ.

"చాల్లే నోరు మూసుకో. నీకేమైందిప్పుడు. అదిగో చూడు. ఆ ముండాకొడుక్కేమైనా బుద్ధివుందా? ఆ టీవీతో ఛస్తానంటూ మళ్లీ అదరగొట్టేస్తున్నాడు."

తులశమ్మ కళ్లల్లో నీళ్లు తిరిగినై. అసహనంతో అసహాయతతో కూడిన రోషం పెల్లుబికింది. విసుగు పుట్టింది. ఒక్క ఉదటున హాల్లోకి వెళ్లి రాజు వీపుమీద చరిచింది. "ఎన్నిసార్లు చెప్పాలి సిగ్గులేని వెధవా. ఇరవై నాలుగ్గంటలూ అక్కడే పడి ఏడవకపోతే పోయి చదువుకు ఛావరాదూ? " అంటూ ఎడాపెడా చేతుల్తో వాయించింది. "ఛీ...ఛీ... ఎంతచెప్పినా బుద్ధిలేదు. పో... అవతలికి" అంటూ వాణ్ణి మెడబెట్టి గెంటింది. దూరంగా తోసేసింది. రాజు కిందపడ్డాడు. లేచాడు.

రాజు గింజుకున్నాడు. ఏడుపులో కసినీ, కసిలో ఏడుపునీ రంగరించుకుని కన్నీళ్లు పెట్టుకున్నాడు. నిండు కుండలు కారిపోసాగినై. పళ్లు పరపరలాడించాడు. పిడికిళ్లని గాలిలోకి లేపి హస్త విన్యాసంచేశాడు. ఒకేసారి వేయి శాపాలు పెడుతున్నట్టు తల్లినీ తండ్రినీ మిర్రి మిర్రిగా చూశాడు. వెర్రి వెర్రిగా చూశాడు. శబ్దం చేస్తూ కాళ్లు తాటించాడు. విసురుగా అక్కణ్ణించీ కదలి పోయాడు.

-అప్పుడు ఇంట్లో అందరూ ఏమేమో మాట్లాడుతూనే వున్నారు. ఒకరు మాట్లాడేది ఒకరు వినరు. విన్నా తమధోరణిని తాము ఆపరు!

రాత్రి తొమ్మిది దాటింది. అప్పటికి అంతా నాలుగు ముద్దలు గతికారు. ఇల్లు సద్దుమణిగింది.

పుస్తకాలు ముందు పెట్టుకొని హాల్లో కూర్చున్నాడు రాజు.

వాడికి బుర్రంతా ఇటుక ఆవంగా వుంది. మెదడు కాలిపోతోంది. కడుపు రగిలిపోతోంది. తల్లి కొట్టిన దెబ్బలకంటే తండ్రి మాట పీకుతోంది. ఎందుకు తిట్టాలి తనని? టీవీ చూడటం తప్పా!? వీళ్లందర్నీ కట్టకట్టి ఉతికెయ్యాలి! అమ్మకి అమ్మ మాత్రం... మంచీ మర్యాదా లేకుండా తనను కొడుతుందా? తను ఒక్క గుద్దు గుద్దితే.... చచ్చూరుకుంటుంది.....

"ఛీ...ఛీ..." అనుకుంటూ లేచాడు రాజు. మహాపర్వతాల్ని జయించే శూరుడిలా లేచాడు. పందెపుటెద్దుని ఎదుర్కొనే గుండెబలం గల వీరుడిలా లేచాడు.

***

నాలుగింటికే మెలకువ వచ్చింది తులశమ్మకి. పక్కన పిచ్చెయ్య గుర్రు పెడుతున్నాడు. విసుగునీ, చిరాకునీ, కసినీ, క్రోధాన్నీ, అరుపుల్నీ, పొలికేకల్నీ; ఆవేదనల్నీ; అణుచుకున్న, అణుచుకోలేకపోయిన...అన్ని సొదలనీ, రొదలనీ... మూడో పురుషార్థంలో లయంచుకొని, ఊరటపొంది, తన సానుభూతి కలిగించిన స్పర్శలో, దగ్గరితనంలో కరిగిపోయి, కలిసిపోయి, అలసిపోయి.....

తనని కౌగలించుకొని పడుకుని వున్నాడు!

తులశమ్మ సన్నగా నవ్వుకుంది! నెమ్మదిగా కదిలి, పక్కకి జరిగి, మంచం దిగింది.

గదిదాటి హాల్లోకి వచ్చింది. రాజు లేడు. ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగినై. పక్కగది చూసింది. అత్తా, ఆడపడచూ ఉన్నారు. బయటి తలుపు చూసింది. గడియవేసిలేదు. ఆమెకు దడ మొదలైంది. తలుపు దగ్గరకి వేసి తెల్లవార్లూ అందరూ మొద్దునిద్రపోయారనే వాస్తవం... కాళ్ళూ చేతులూ ఆడనీయలేదు. మరోపక్క రాజు ఏమయ్యాడనే ఆతృత. ఇల్లంతా కలియ చూసింది. బాత్‌రూమ్ చూసింది. రాజు లేడు. బయటికి వచ్చి నలుదిక్కులా ఆవరణ అంతా చూసింది. చీకటి మసక మసకగా వుంది. బెరుకు బెరుగ్గావుంది. రాజు కనపళ్లేదు. ఊపిరి బిగపట్టుకొని ఆవరణంతా తిరిగింది. కంపెనీ క్వార్టర్స్ వెలుగు నీడలు చెట్లతో, చెట్ల నీడలతో ఆడుకుంటున్నై. గేటు దగ్గర ఘూర్కా పలకరించాడు. ఏవిటంటే ఏడుపొచ్చింది. పగిలిన కంఠంతో అడిగింది. రాత్రి పదింటికి సైకిలూ. పుస్తకాల సంచీ తీసుకొని ఎటోవెళ్ళాడు కదా అన్నాడు. కాళ్ళు నిల్వలేదు. రక్కున వెనక్కొచ్చింది. గదిలోకి వెళ్ళి పిచ్చెయ్యని లేపింది.... క్షణాల్లోనే ఇల్లంతా భయం పరచుకుంది.

***

ఆకాశం అంచున సూర్యుడు లేస్తున్నాడు. కాలనీ నిద్రలేచింది. ఊరు మేలుకొంది.

మనస్సును ఉగ్గబట్టుకొని , కాళ్ళు సాగుతున్నై. రాజుని వెతుకుతూ నలుగురూ నాలుగు దిక్కులకు పోతున్నారు. వస్తున్నారు. రాజు జాడ లేదు.

పిచ్చెయ్య పెళ్లాన్నీ తల్లినీ, చెల్లెల్నీ విడివిడిగానూ... కలిపి ఏకమొత్తంగానూ... తిడుతున్నాడు. పళ్లు కొరుకుతున్నాడు. అందరి మొహాల్లో దిగులూ, కళ్లల్లో భీతీ.

పిచ్చెయ్య తల్లి... కోడల్నీ, కొడుకునీ సాధిస్తోంది. మధ్య మధ్యలో కళ్లొత్తుకుంటోంది. తులశమ్మ చిన్నపిల్లలా ఏడుస్తోంది. పెద్దకూతురుకీ కొడుక్కీ తెలపాలనుకుంటోంది ఆ మాట అనటానికి మొగుడిముందు మళ్లీ ధైర్యం చాలడంలేదు. క్వార్టర్స్‌లో కుర్రాళ్లంతా వూళ్లోకి పోయారు. మగవాళ్లలో సగం మంది ఆవరణలో పెద్ద వేపచెట్టుకింద చేరారు. పోలీసులకి చెప్పమన్నారు ఎన్నెన్నో సలహాలూ, సూచనలూ వస్తున్నై.

బారెడు పొద్దెక్కింది. ఎవరో కుర్రాడు ఉరుకులు పరుగులమీద వచ్చాడు.

రాజు కనిపించాడు! వాళ్ల స్కూల్ కాంపౌండ్‌లో సైకిల్ తొక్కుతున్నాడు.

అంతా స్కూల్ కాంపౌండ్‌లో చేరారు. జనం మూగారు. పిచ్చెయ్య కేకలేస్తూ గదమాయిస్తూ కొడుకుని ఇంటికి పదమన్నాడు రాజు ఉలకలేదు. పలకలేదు. సైకిల్ మీద రాజు... సైకిల్ తిరిగిపోతోంది. తులశమ్మ ఏడుపు. పిల్లవాణ్ణి పట్టుకున్నది. వాడు ఆగలేదు. విసురుగా బలమంతా కూడదీసుకొని తొక్కుతున్నాడు. ఉన్నట్లుండి పెద్దగా అరిచాడు. "ఎవరూ దగ్గరికి రాకండి" మాట పూర్తి కాకుండా ఏడుపు పొంగుకొచ్చింది. ఏడ్చేశాడు. బేలెన్స్ తప్పింది. క్రింద పడిపోయాడు. తల్లి ఏడుస్తూనే పక్కకి చేరింది. వాడి ప్రాణాలు కళ్లల్లో ఉన్నై. కాళ్ళ పాదాలు ఉబ్బిపోయినై. రెప్పలు తాటిస్తున్నాడు. అరమోడ్పుగా ఉన్నై కళ్లు.

రాత్రంతా సైకిల్ తొక్కుతూనే ఉన్నట్టు తేలింది. పిచ్చెయ్య గుండె ద్రవించింది. కళ్లనీళ్లతోనే చెల్లాచెదురుగా పడి ఉన్న పుస్తకాల్ని ఏరుకొచ్చాడు.

అతి కష్టంమీద ఆటోలో ఇంటికి తీసుకొచ్చారు.

అసంకల్పంగా పుస్తకాలు తిరగేస్తే... ఒకనోట్‌బుక్ అంతా... పూర్తిగా తమ కథే! అమ్మా నాన్నా అన్యాయంగా, అనవసరంగా తననే తిడతారనీ, కొడతారనీ.... తనకు వాళ్లమీద చంపేసేటంత కోపమనీ... ఏమోమో రాసి వుంది. నోట్‌బుక్ చివర్లో వాక్యాలు ఇవీ: అమ్మా నాన్నకి కోపం వస్తే నన్ను కొట్టారు. నాకు కోపం వస్తే... ఏంచేయాలి?...

పిచ్చెయ్య తల తిరిగిపోయింది.

తులశమ్మ తల దిమ్మెక్కింది.

పరామర్శలకి వచ్చిన జనంలో ఎవరో అంటున్నారు. పొద్దున్న రాజు గురించి చెప్పడానికి ఎం.డీ. గారింటికి పోతే... ఎం.డీ.గారి సతీమణి మొగుణ్ణి ఎడాపెడా తిట్టేస్తున్నదని!!

పక్కనున్న పెద్దాయన ఎవర్తోనో చెప్తున్నాడు. “అయితే ఆఫీసులో ఇవ్వాళ ఎవరికో మూడిందన్న మాటే!!”

అంతేనా!!!...

పిచ్చెయ్య తులశమ్మ కేసి చూశాడు. ఆమె తల వంచుకుంది. మరుక్షణం తులశమ్మ తల ఎత్తి భర్త కళ్లల్లోకి చూసింది. అప్పుడు పిచ్చెయ్య చూపు మరల్చి తల దించుకున్నాడు.

అవును... చూపు-లో చూపు- కావాలి!!

***

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 3-9 ఆగష్టు, 1994.)